క్లుప్తంగా

మంత్రికి శుభాకాంక్షలు



మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రిని కలిసిన ఎమ్మెల్యే పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

షాద్‌నగర్ ఆర్డీఓ బదిలీ



ఆర్డీఓ వెంకట మాధవరావు

షాద్‌నగర్: షాద్‌నగర్ ఆర్డీఓగా విధులు నిర్వహిస్తున్న వెంకటమాధవరావును బదిలీ చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. చీఫ్ ఎలక్షన్ కార్యాలయంలో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఎస్ఆర్ సరిత షాద్‌నగర్ ఆర్డీఓగా బదిలీపై రానున్నారు. అయితే గత రెండేళ్లుగా ఇక్కడ విధులు నిర్వహించిన వెంకటమాధవరావు మహబూబాబాద్ డీఆర్‌ఓగా బదిలీపై వెళ్లనున్నారు.

చేవెళ్ల ఆర్డీఓ సాయిరాం బదిలీ



చేవెళ్ల: చేవెళ్ల ఆర్డీఓగా విధులు నిర్వహిస్తున్న సాయిరాంను బదిలీ చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు విడుదల చేసింది. ఆయన స్థానంలో చంద్రకళను చేవెళ్ల ఆర్డీఓగా వేశారు. ఆర్డీఓ సాయిరాం అసెంబ్లీ ఎన్నికలకు ముందే చేవెళ్లకు బదిలీపై వచ్చారు. ఆయన సికింద్రాబాద్ ఆర్డీఓగా బదిలీపై వెళ్లారు.

నియామకం



కుమార్‌కు నియామకపత్రం అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్: బహుజన సమాజ్ పార్టీ షాద్‌నగర్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా మండల పరిధిలోని వెలిజర్ల గ్రామానికి చెందిన తుప్పరి కుమార్‌ను నియమించారు. ఈ మేరకు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా ఇన్‌చార్జి దొడ్డి శ్రీనివాస్, నియోజకవర్గ అధ్యక్షుడు సొంటి శ్రీనివాస్‌లు నూతనంగా నియమితులైన తుప్పరి కుమార్‌కు నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నర్సింలు, రాంప్రసాద్‌గౌడ్, మోజెస్, రాధాకృష్ణ, కొండేటి మహేందర్, శివగల ఆంజనేయులు, నీరటి రాజు, శరత్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న వైద్యసిబ్బంది

షాబాద్: పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు స్రవంతి, చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని అంతిరెడ్డిగూడ గ్రామంలో సిబ్బందితో కలిసి పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పశువుల ఆరోగ్యం పట్ల రైతుల జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పశుసంవర్థకశాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో పశువులకు గాలికుంటు నిరోధక టీకాలు వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, రైతులు తదితరులు ఉన్నారు.

పాఠశాలల బలోపేతానికి కృషి చేద్దాం

ఎంఈఓ వెంకటయ్య

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అందరం కలిసి కృషి చేద్దామని మండల విద్యాధికారి వెంకటయ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని అమ్డాపూర్ ప్రాథమిక పాఠశాలలో అదే గ్రామానికి చెందిన దాత బాత్కు భరత్‌కుమార్ సహాయంతో కిచెన్ షెడ్‌ను ఉపాధ్యాయులు కూర్చోవడానికి ప్రాంతీయ కార్యాలయముగా అభివృద్ధి చేశారు. ఈ సందర్భంగా ఆ కార్యాలయాన్ని ఎంఈఓ ప్రారంభించారు. అనంతరం దాతను ఆయన అభినందించారు. పాఠశాల ఆవరణలో ఆయన విద్యార్థులతో కలిసి పండ్లు, పూల మొక్కలను నాటి నీరు పోశారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి మల్లయ్య, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు రేణుక, నరేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు కై సర్, అహ్మద్, వినోద్‌కుమార్, విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆమడ దూరం

- అనుబంధ గ్రామాల్లో కనీస సౌకర్యాలు కరువు
- నిధులు మంజూరైనా పనుల నిర్వహణలో జాప్యం
- ఇబ్బంది పడుతున్న తండాల ప్రజలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



చుక్కమెట్టు గ్రామ వ్యూ

కొందుర్గు: గ్రామ పంచాయతీలకు అనుబంధంగా ఉండే గ్రామాల్లో కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న అటు పాలకులు, ఇటు అధికారులు పట్టించుకోకపోవడం లేదు. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆయా గ్రామాలకు సంబంధించి అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరైనా స్థానిక నాయకులు, అధికారుల నిర్లక్ష్యంతో సమస్యలు తీరడం లేదు. కొందుర్గు మండలంలో 22 గ్రామ పంచాయతీలతో పాటు 8 అనుబంధ గ్రామాలు ఉన్నాయి. అదేవిధంగా జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో 24 గ్రామ పంచాయతీలతో పాటు 18 అనుబంధ గ్రామాలు, గిరిజన తండాలు ఉన్నాయి. అయితే జీపీల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు ఉండడంతో జీపీల్లో కొంతవరకు అభివృద్ధి పనులు జరుగుతున్నప్పటికీ అనుబంధ గ్రామాల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది.

కొన్ని అనుబంధ గ్రామాల దుస్థితి..

కొందుర్గు మండలం చుక్కమెట్టు రెవెన్యూ గ్రామం. ఇక్కడ 20 కుటుంబాలు, దాదాపు 100 వరకు జనాభా ఉంటుంది. ఈ గ్రామంలో పూర్వకాలంలో అన్నివర్గాల వారు నివసించేవారు. కాని ఇక్కడ సరైన వసతులు లేకపోవడంతో చాలావరకు కుటుంబాలు సమీప గ్రామమైన ముట్పూర్‌కు వలస వెళ్లారు. ఇక కేవలం దళిత కుటుంబీకులు మాత్రం ఉన్న ఊరు విడిచి వెళ్లే స్తోమత లేక అక్కడే కాలం గడుపుతున్నారు. ఇక్కడ జీవనం సాగించేది దళితులు మాత్రమే. అయితే 20 ఏళ్ల క్రితమే ఇక్కడ



రంజాతండాకు వెళ్లాలంటే ఎద్దుల బండ్లే దిక్కు

ప్రభుత్వం పాఠశాలను ప్రారంభించింది. ప్రభుత్వం నిధులు మంజూరు చేయించి పాఠశాల భవనం నిర్మించింది. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని మంజూరు చేశారు. కానీ ప్రస్తుతం పాఠశాల భవనం మూతపడింది. అంగన్‌వాడీ కేంద్రాన్ని ముట్పూర్ గ్రామానికి మార్చారు. దీంతో చిన్నారులు చదువుకోవాలంటే ముట్పూర్‌కు వెళ్లాలిందే. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో బీటీరోడ్డు పనులను ప్రారంభించారు. కాని అదీ అసంపూర్తిగానే ఉంది. తంగెళ్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో తంగెళ్లపల్లి దళితవాడకు ప్రభుత్వం పాఠశాలను మంజూరు చేసింది. పాఠశాల భవనం కోసం రెండు గదులకు నిధులు మంజూరైనా నేటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. అయోద్యాపూర్‌తండా పరిధిలో రామన్నగడ్డతండా పాఠశాల ఉన్నా విద్యార్థులు లేరని ఆ పాఠశాలలో విధులు నిర్వహించే ఉపాధ్యాయులు డిప్యూటేషన్‌పై పుల్లప్పగూడ పాఠశాలకు పంపించారు. ప్రస్తుతం ఈ గ్రామంలో విద్యార్థులు లేరని ప్రభుత్వం కొత్త ఉపాధ్యాయులను నియమించలేదు. దీంతో బడి మూతపడింది.

జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో..

మండలంలోని పద్మారం గ్రామపంచాయతీ రంజాతండాలో 20 కుటుంబాలు, దాదాపు 100 మంది జనాభా ఉంటుంది. అయితే ఇక్కడ ప్రభుత్వం పాఠశాల భవనం కోసం నిధులు మంజూరు చేసినప్పటికీ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. దీంతో పాఠశాలను సమీపంలో ఉన్న వికారాబాద్ జిల్లా పరిగి మండలం చాకలిపల్లితండాలో నడిపిస్తారు. అనుబంధ గ్రామాల్లో రేషన్‌షాపులు లేకపోవడంతో ప్రతినెల రేషన్ సరుకుల కోసం కాలినడకన గ్రామ పంచాయతీ కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోందని లబ్ధిదారులు వాపోతున్నారు. చివరకు ఆసరా పింఛన్ కోసం వృద్ధులు, దివ్యాంగులు నానాఇబ్బందులు పడుతున్నారు. ఇక శివారు గ్రామాలకు రోడ్డు సౌకర్యం సరిగా లేకపోవడంతో వర్షాకాలంలో అవస్థలు పడుతున్నారు.

ముట్పూర్‌కు వెళ్లి సరుకులు తెచ్చుకోవాలి



ప్రతినెల రేషన్ సరుకులను ముట్పూర్‌కు వెళ్లి తెచ్చుకోవాలి. అదేవిధంగా చదువుకోవాలంటే పిల్లలు ప్రతిరోజు 5 కిలో మీటర్లు నడిచివెళ్లాలి. చివరకు పౌష్టికాహారం కోసం గర్భిణులు, బాలింతలు ముట్పూర్‌కు వెళ్లాలి.

–ఆగిర్యాల లక్ష్మి

రోడ్డు వేయిస్తే బాగుండేది



మా తండాకు రోడ్డు వేయిస్తే బాగుండేది. వర్షాకాలంలో నడిచి వెళ్లాలంటే కూడా వీలు కాదు. బురదలో దిగబడుతూ నడవాలి. ఓట్లు వేయించుకునేటప్పుడు తండాకు అన్ని చేస్తాం అంటారు. ఓట్లు అయిపోయాక ఎవరు మళ్లీ తిరిగి చూడరు.

–లక్ష్మమ్మ, రంజాతండా

ఉన్నతాధికారులకు నివేదిస్తాం



ప్రస్తుతం చుక్కమెట్టు, రామన్నగడ్డతండా పాఠశాలలు విద్యార్థులు లేకపోవడంతో మూతపడ్డాయి. ఒకవేళ విద్యార్థులు ఉన్నట్లయితే వారి వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకుంటాం.

–గాయత్రి, ఎంఈఓ, కొందుర్గు

పోటీతత్వం ఎంతో అవసరం



విద్యార్థిని అభినందిస్తున్న సిబ్బంది

మొయినాబాద్‌రూరల్: విద్యార్థుల విజ్ఞానాన్ని వెలికితీసేందుకు పోటీతత్వం ఎంతో ముఖ్యమని హిమాయత్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాల హెచ్‌ఎం ఆంజనేయులు పేర్కొన్నారు. సోమవారం పాఠశాల ఆవరణలో విద్యార్థి ఎక్స్‌ప్రోజర్ విజిట్ అనే ప్రోగ్రామ్‌లో గోల్డ్ మెడల్ సంపాదించినందుకు ఆమెను అభినందిస్తూ సన్మానించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో జరిగిన పోటీల్లో హిమాయత్‌నగర్ పాఠశాల విద్యార్థులు పాల్గొనగా 9వ తరగతి విద్యార్థిని రేణుక డ్రాయింగ్ పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా సెంట్రల్ యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో రేణుకకు సీఈఓ రేఖ చేతులమీదుగా బహుమతి అందించారు. దీంతో పాఠశాల ఆవరణలో సోమవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నీలిమ, విజయ్‌కుమార్, రాములు, కళావతి, అరుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణానికి విరాళం

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయస్వామి దేవాలయ నిర్మాణానికి కీ.శే ప్రభులింగం జ్ఞాపకార్థం వారి కుమారులు కట్టా చంద్రశేఖర్, కట్టా శ్రీనివాస్, కట్టా రవి, కట్టా రాజేందర్‌లు రూ.1లక్ష 11వేల 116ల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు విరాళాన్ని వారు అందజేశారు. కార్యక్రమంలో కక్కునూరి వెంకటేశ్‌గుప్తా, అన్మారి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

ఎంపీడీఓ అపర్ణ



మాట్లాడుతున్న ఎంపీడీఓ అపర్ణ

షాబాద్: మానవ అక్రమ రవాణా నిర్మూలనలో అందరూ భాగస్వాములు కావాలని ఎంపీడీఓ అపర్ణ, ప్రజ్వల సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ బలరామకృష్ణ, చేవెళ్ల ఇన్‌చార్జి సీడీపీఓ సునీత పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ చేవెళ్ల ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లకు రెండురోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద మధ్య తరగతి, వలస కార్మికుల అమ్మాయిలు, మహిళలు ఎక్కువగా అక్రమ రవాణాకు గురవుతున్నారన్నారు. ఉద్యోగం, ప్రేమ పెళ్లి పేరుతో మోసం చేసి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారన్నారు. సమాజంలో ప్రజలతో అత్యంత సన్నిహితంగా ఉండే అంగన్‌వాడీ టీచర్లు వారి ఆర్థిక సామాజిక స్థితిగతులను గమనించి వారికి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజ్వల సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ బలరామకృష్ణ మాట్లాడుతూ.. ప్రజ్వల సంస్థ గత 28 సంవత్సరాల నుంచి లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా పనిచేస్తూ 2,8600 మంది అమ్మాయిలను కాపాడి పునరావాసం కల్పించిందన్నారు. ప్రతి అంగన్‌వాడీ టీచర్ తమ పరిధిలోని మహిళలకు, అమ్మాయిలకు అక్రమ రవాణాపై అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రజ్వల రాష్ట్ర కో–ఆర్డినేటర్ సురేశ్‌కుమార్, సిబ్బంది అంబర్‌సింగ్, మితాళి రాజ్, కేశవ్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సృజన, వాణి, పారిజాత, శ్రీలక్ష్మి, రమాదేవి, షాబాద్, మొయినానాబాద్ అంగన్‌వాడీ టీచర్లు తదితరులు ఉన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని వినతి

షాద్‌నగర్‌రూరల్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని తపస్ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం తపస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ పార్థసారధికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి పదినెలలు గడుస్తున్నా ఉద్యోగులు, ఉపాధ్యాయులకు నేటి వరకు ఆర్థికపరమైన ప్రయోజనం కలగలేదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన నాలుగు డీఏలు, ఈ కుబేర్‌లో ఉన్న పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పీఆర్సీ కమిటీ రిపోర్టును తెప్పించుకొని అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దశలవారీగా ఉద్యమ కార్యాచరణను రూపొందించుకొని ప్రభుత్వంపై పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు జనార్దన్‌రెడ్డి, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉపన్యాస పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సీఈఓ రేఖ

షాబాద్: సైన్స్ డిబెట్, క్విజ్, ఉపన్యాస పోటీల్లో మండల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచినట్లు యూనైటెడ్ వే ఆఫ్ సీఈఓ రేఖ శ్రీనివాసన్ పేర్కొన్నారు. సోమవారం యూనైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ వారు ఆకృతి ప్రాజెక్ట్‌లో సైన్స్ ఎగ్జిబిషన్ కోసం మండలంలో ఉన్న నాలుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులను హైదరాబాద్ యూనివర్శిటీకి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. షాబాద్ జిల్లా పరిషత్ బాలికల పాఠశాల, సర్దార్‌నగర్, పోతుగల్, తాళ్లపల్లి పాఠశాలల విద్యార్థులను తీసుకెళ్లినట్లు తెలిపారు. షాబాద్ మండల విద్యార్థులకు సైన్స్ డిబెట్, సైన్స్ క్విజ్, ఉపన్యాస పోటీ, సైన్స్ ఆర్ట్స్ పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. అందులో విద్యార్థులకు సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ వారు విజేతలను ప్రకటించి బహుమతులను అందజేశారన్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులతో పాటు, మెడల్స్‌ను సర్టిఫికెట్లను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆకృతి ప్రాజెక్టు ప్రోగ్రాం మేనేజర్ ముంతాజ్ పర్వీన్, సీనియర్ అసోసియేట్ అమర్‌నాథ్ యాదవ్, డిస్ట్రిక్ట్ అకాడమిక్ కో–ఆర్డినేటర్ శ్రీనుయాదవ్, ప్రాజెక్ట్ లీడ్ పవిత్ర, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పంచాయతీ వర్కర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి



ఎంపీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కొత్తూరు: జీపీల్లో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం నెలకు రూ.21వేల వేతనాలు ఇవ్వాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా ఆయన సోమవారం పలువురు కార్మికులతో కలిసి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎంపీఓ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పంచాయతీల్లో పనిచేసే కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడంతో పాటు ఈఎస్‌ఐ, పీఎఫ్, వారంతపు సెలవులు ఇవ్వాలన్నారు. అంతేకాకుండా కార్మికులు పనిచేసే సమయంలో ధరించడానికి బూట్లు, గ్లౌజులు, ఇతర సామగ్రిని ఉచితంగా అందజేయాలని కోరారు. పంచాయతీ కార్మికులు తమ ప్రాణాలను పణంగా పెట్టి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతున్నారన్నారు. కాగా ప్రభుత్వం వారితో వెట్టిచాకిరీ చేయిస్తూ కనీస వేతనాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. పెరిగిన నిత్యావసరాల ధరలతో పంచాయతీ కార్మికులు కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించి పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు. లేనిపక్షంలో విడతల వారీగా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి శేఖర్‌రెడ్డి, కార్మికులు వసంత, యాదమ్మ, సురేశ్, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ డిప్యూటేషన్లు రద్దుచేయాలి

ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థుల ధర్నా



పాఠశాల ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు, విద్యార్థులు

షాద్‌నగర్‌రూరల్: విద్యాశాఖలో అక్రమ డిప్యూటేషన్లు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట ప్రాథమికోన్నత పాఠశాల ఎదుట ఏఐఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు పవన్ చౌహాన్ మాట్లాడుతూ.. ఎలికట్ట పాఠశాలలో గత ఏడు సంవత్సరాల క్రితం గణితం బోధించే ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్‌రావు డిప్యూటేషన్‌పై వెళ్లడంతో విద్యార్థులు ఎంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. సదరు ఉపాధ్యాయుడు డిప్యూటేషన్‌పై వెళ్లినా ఇదే పాఠశాల నుంచి జీతం తీసుకోవడం సరికాదన్నారు. విద్యాశాఖలో వెంటనే అక్రమ డిప్యూటేషన్లను ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆకాశ్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూత



విద్యార్థులకు టై, బెల్ట్‌లు అందజేస్తున్న దాతలు

షాబాద్: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులను దాతలు ఆదుకోవాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని నాగర్‌గూడ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఐడీకార్డులు, టై, బెల్టులు, సౌండ్ బాక్స్‌లను అదే గ్రామానికి చెందిన దాతలు అందజేశారు. పాఠశాలకు దాతల సహకారంతో పెయింటింగ్ వేయించామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు కావాల్సిన అవసరాల కోసం దాతలు ముందుకొచ్చి వారికి సహాయం చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి అందరూ తమ వంతు కృషి చేయాలన్నారు. పేద విద్యార్థులను దాతలు ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యాప్రమాణాలు పెంచేందుకు అందరి సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఈదుల కృష్ణగౌడ్, కాంప్లెక్స్ ఇన్‌చార్జి హెచ్‌ఎం నాగిరెడ్డి, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు దేవిడ్‌రెడ్డి, హెచ్‌ఎం బి.కృష్ణ, ఉపాధ్యాయులు ఎల్.నర్సింలు, కవిత, అమ్మ అదర్శ కమిటీ చైర్మన్ రావుల లక్ష్మి, దాతలు వడ్డే కృష్ణ, వెంకటయ్య, ముక్తార్, బేగరి శ్రీను, పరమేశ్, విఠలయ్యగౌడ్ తదితరులు ఉన్నారు.

బీజేపీతోనే అన్నివర్గాలకు న్యాయం

పార్టీ చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి నవీన్‌కుమార్



సభ్యత్వ నమోదు చేస్తున్న నవీన్‌కుమార్, కిరణ్‌కుమార్

షాబాద్: బీజేపీతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి నవీన్‌కుమార్, మండల అధ్యక్షుడు కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఇంటింటికీ తిరిగి బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ సభ్యత్వ నమోదును చేపడుతున్నట్లు చెప్పారు. దేశంలో బీజేపీని అతిపెద్ద రాజకీయ పార్టీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు. బీజేపీ సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై నేడు యువకులు, మహిళలు పెద్దఎత్తున తమ పార్టీలో సభ్యత్వం పొందుతున్నారన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు వినయ్, లంబడి రాజు, రాజేశ్, ప్రశాంత్, విజయ్, అనిల్, తదితరులు ఉన్నారు.

బీజేపీ సత్తా చూపాలి

కొందుర్గు: రాబోయే స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తా చూపాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి సూచించారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని జాకారం, కాస్లాబాద్, రావిర్యాల, లచ్చంపేట గ్రామాల్లో పర్యటించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకతతో ఉన్నారన్నారు. బీజేపీలో చేరాడానికి స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తాచూపాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు భూపాలచారి, బీజేపీ మండల కమిటీ అధ్యక్షుడు కుర్మయ్య, నాయకులు సుధాకర్‌రావు, మల్లేశ్, మహేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, శ్రీనివాసు, రమేశ్, రాజు పాల్గొన్నారు.

ఇళ్లు ఇచ్చేందుకు రాజకీయాలెందుకు?

మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్

షాద్‌నగర్: అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇళ్లను ఇచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ నేతలు రాజకీయాలు ఎందుకు చేస్తున్నారని మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజన్ ప్రశ్నించారు. సోమవారం పట్టణంలోని బీఆర్‌ఎస్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం షాద్‌నగర్ పట్టణ శివారులో మొత్తం 1694 డబుల్ ఇళ్లకు గాను 1383 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. గత ఎన్నికల ముందు నాటి మంత్రి కేటీఆర్ 7 మంది లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను కూడా అందజేసినట్లు తెలిపారు. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ నాయకులు వార్డుల్లో తిరుగుతూ డబుల్ ఇళ్ల కోసం తిరిగి దరఖాస్తులు చేసుకోవాలని చెబుతున్నారన్నారు. దీంతో ఇప్పటికే డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ఆందోళన గురువుతున్నారన్నారు. ఇళ్ల కేటాయింపు సమయంలో కాంగ్రెస్ నేతలు గందగోళానికి తెరలేపారని, దీనికి ఎమ్మెల్యే, అధికారులు సరైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అనర్హులకు ఇళ్లు కేటాయిస్తే వెంటనే వాటిని రద్దు చేయాలన్నారు. అదేవిధంగా ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం నియమిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల కమిటీలకు, డబుల్ బెడ్రూం ఇళ్లకు ఏమిటి సంబంధం అని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీలు పారదర్శకంగా లేవని, నిబంధనల ప్రకారం కమిటీలో సభ్యుల ఎంపిక ప్రక్రియ జరగలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ నేతలు రాజకీయాలు చేయకుండా పేదలకు వెంటనే డబుల్ బెడ్రూం ఇళ్లను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కోఆప్షన్ సభ్యులు ఒగ్గుకిషోర్, యుగేంధర్, చింటూ, జూపల్లి శంకర్, చీపిరి రవియాదవ్, అంతయ్య, శ్రీనివాస్‌గౌడ్, నందీశ్వర్, అద్దు, సుధీర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.